## క్లుప్తంగా

### నేడు మండల పరిషత్ ప్రత్యేక సమావేశం

షాద్‌నగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం మండల పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వినయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశంలో దశాబ్ది ఉత్సవాల నిర్వాహణకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు విధిగా హాజరవ్వాలని ఆయన కోరారు.

**దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం**

**కేశంపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్ రెడ్డి అన్నారు. ఈ సమావేశం ఎంపీపీ రవీందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండల కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉదయం 10గంటలకు హాజరు కావలని కోరారు.

### షాద్‌నగర్ ఏజీపీగా రాజ్‌గోపాల్

షాద్‌నగర్: షాద్‌నగర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా సీనియర్ న్యాయవాది కంచి రాజ్‌గోపాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందిస్తానన్నారు.

### సివిల్ ర్యాంకర్ సుస్మితకు సన్మానం



సుస్మితను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

షాద్‌నగర్: సివిల్ సర్వీస్ పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో 384వ ర్యాంకు సాధించిన సుస్మితను షాద్‌నగర్ కిరాణ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పలబట్ల బాల్‌రాజ్, అధ్యక్షుడు బలపట్ల సతీశ్, కార్యదర్శి కూచూరి ప్రవీణ్, గార్లపాటి శ్రీనివాస్, చెన్నారపు ప్రవీణ్, నర్సింహ, కరుణాకర్, అభి, రాజు, శ్రీనివాస్, వెంకటేశ్, ఆరీఫ్ పాల్గొన్నారు.

### మొక్కలు నాటి సంరక్షించండి

సర్పంచ్ వెంకట్‌రెడ్డి

నందిగామ: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తమ బాధ్యతగా ఇంటి అవరణలో, కార్యాలయాల ఆవరణలలో విధిగా మొక్కలు నాటాలని సూచించారు. సీఎం కేసీఆర్ నిర్వహించిన హరితహారం కార్యక్రమంతో పల్లెలు ఆకుపచ్చగా మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమార్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు బేగ్, ఏడీ రవీందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పాటిగడ్డలో 'కంటి వెలుగు'



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కార్తీక్

**కేశంపేట:** మండల పరిధిలోని పాటిగడ్డలో మంగళవారం కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిట్టీలమ్మ, ఏఎస్ఎం పార్వతమ్మ, ధన్‌రాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఉపాధి పనుల పరిశీలన

**కొందుర్గు:** ఉపాధి హామీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. మండల కేంద్రం నుంచి వికారాబాద్ జిల్లా పరిగి మండలం తొండపల్లి గ్రామానికి ఉపాధి పనుల్లో భాగంగా రోడ్డు ఫార్మేషన్ పనులు చేస్తున్నారు. ఈ పనులను మంగళవారం ఎంపీడీఓ మహేశ్‌బాబు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొలతల ప్రకారం పనిచేస్తే కూలీలకు నిర్ణీత కూలీ పడుతుందని చెప్పారు. అనంతరం ఆయన కూలీల మస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట టీఏ వినోద్ పాల్గొన్నారు.

## విమర్శించిన నేతలే ఆశ్చర్యపోతున్నారు

- కేంద్రం కృష్ణా జలాల వాటా తేల్చాలి
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**షాద్‌నగర్:** ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతుందని విమర్శించిన నేతలే నేడు సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య అన్నారు. నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండల కేంద్రంలో రూ.2కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం, రూ.15కోట్లతో షాద్‌నగర్–కేశంపేట రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.45కోట్లతో పాత జాతీయ రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన, షాద్‌నగర్‌లో రూ.1.88కోట్లతో నిర్మించిన గ్రంథాలయ భవన ప్రారంభోత్సవం, రూ.95కోట్లతో నిర్మిస్తున్న చటాన్‌పల్లి ఆర్‌ఓబీ శంకుస్థాపన, చటాన్‌పల్లిలో రూ.1.40కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్ ప్రారంభం, రూ.45 కోట్లతో నిర్మించిన నైట్ షెల్టర్ భవనం, రూ.కోటితో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్,



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దూర దృష్టితో ఆలోచిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తున్నామన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంపై ప్రతిపక్ష నేతలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దండాపూర్ వద్ద ప్రాజెక్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయని అక్కడ పనులు పూర్తైన వెంటనే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేంద్రం వెంటనే తేల్చాలని డిమాండ్ చేశారు.

## ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

'శుభోదయం'లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**షాబాద్:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హైతాబాద్, అంకుగూడ, హైతాబాద్ తండా గ్రామాల్లో ఆయన జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి శుభోదయం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎవరి ప్రమేయం లేకుండానే సంక్షేమ పథకాలన్నీ నేరుగా అందుతున్నాయని ప్రజలు ఆనందంగా వివరిస్తున్నారని చెప్పారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు చేస్తున్నామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని చెప్పారు. ఆ సమస్యలు త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, గ్రామ సర్పంచ్ మల్లేశ్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ, మాజీ సర్పంచ్ దర్శన్, ఉపసర్పంచ్ గోపాల్, ఎంపీడీఓ అనురాధ, ఏఈలు శ్రీదివ్య, శారద, లక్ష్మన్‌నాయక్, ఏపీఓ వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు భూపాల్‌రెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



హైతాబాద్ లో మురుగు కాల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీటీసీ సభ్యుడు

## ప్రజలను చైతన్యం చేయాలి

- పీహెచ్‌సీల్లో మందుల కొరత రానీయొద్దు
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

**షాద్‌నగర్:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను చైతన్యం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం ఆమె పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణలో నియోజకవర్గ పరిధిలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత రానీయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయన్నారు. వైద్యాధికారులు ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది గర్భవతులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతీసారి గర్భిణులకు విధిగా రక్త పరీక్షలు చేయాలని ల్యాబ్‌టెక్నీషియన్లకు వివరించారు. టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి తగిన చికిత్సలు అందించాలన్నారు. ప్రతి రోజు 200 మందికి కంటి వెలుగు పథకంలో పరీక్షలు చేయించాలని ఆదేశించారు. విధి నిర్వాహణలో ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

## కేంద్ర పథకాలను ప్రజలకు వివరించండి

- 'మహా సంపర్క్ అభియాన్'ను విజయవంతం చేయండి
- బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి

**కేశంపేట:** కేంద్రం ప్రభుత్వం ఆధ్వర్యంలో తొమ్మిదేళ్లుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో చర్చించి మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పసుల నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలు, ఎల్ఈడీ బల్బుల ఏర్పాటుకు కేంద్రం ప్రభుత్వం నిధులు అందజేస్తోందన్నారు. శ్మశాన వాటికలు, పల్లె పకృతి వనాల నిర్మాణానికి సైతం కేంద్రం నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. లక్షకోట్ల నిధులు వెచ్చించి జాతీయ రహదారులు నిర్మాణం, విస్తరణ పనులు చేపడుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. గ్రామ పంచాయతీలకు బిల్లులు ఇవ్వకుండా సర్పంచులను వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆధ్వర్యంలో జూన్ 30వరకు నిర్వహించే మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ప్రజలు పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీకాంత్, వెంకటేశ్వర్, మహేశ్, విఘ్నేశ్, వేణుగోపాల్, పాండురంగారెడ్డి, శేఖర్ రెడ్డి, అనిల్, కుమార్, తిరుపతి, సాయిప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కేశంపేట: సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

**ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి**

**కొత్తూరు:** బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పార్టీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు అందజేస్తున్నా బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇస్తున్నట్లు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తలే సైనికుల్లా పని చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వమే గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రణధీర్‌గౌడ్, రాఘవులు, సురేందర్, జగన్, మల్లేశ్, శ్రీశైలం, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**మే 30 నుంచి జూన్ 30 వరకు..**

**షాద్‌నగర్‌రూరల్:** రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అవినీతిని, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని బీజేపీ సీనియర్ నాయకుడు అందె బాబయ్య పిలుపునిచ్చారు. మే 30 నుంచి జూన్ 30 వరకు దేశ వ్యాప్తంగా నిర్వహించే 'మహా సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అందె బాబయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు కేంద్రం నిధులను ఉపయోగించుకొని రాష్ట్ర నిధులని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం 9 సంవత్సరాలుగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, వెంకటేశ్, లష్కర్‌నాయక్, నర్సింహ, రఘుగౌడ్, నర్సింలు, సాయిలు, భరత్, వివేక్, నరేశ్, ముకుందం గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, హన్మంత్, నరేందర్, సాయిలు, రమేశ్, అశోక్‌రెడ్డి, మహేశ్, శ్రీను, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను కేటగిరీలుగా విభజించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

ఎంపీడీఓను కోరిన పంచాయతీ కార్మికులు

**కొందుర్గు:** పంచాయతీ కార్మికులను కేటగిరీలుగా విభజించి రెగ్యులరైజ్ చేయాలని మండల పరిధిలోని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఎంపీడీఓ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలన్నారు. రెగ్యులరైజ్ చేసే వరకు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనం ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో పంచాయతీ జేఏసీ నాయకులు నర్సింహారెడ్డి, భాగ్యమ్మ, ప్రవీణ్, మంజుల, జయమ్మ, జంగమ్మ, సత్యమ్మ, అమృత, వెంకటయ్య,, అంజయ్య తదితరులున్నారు.

**పెండింగ్ వేతనాలు చెల్లించండి**

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ మహేశ్‌బాబుకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమకు ప్రతీనెల క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. పాపయ్య, ఈదమ్మ, బాలమ్మ, లక్ష్మమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

### వైభవంగా ప్రతిష్ఠాపన పూజలు

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

**శంకర్‌పల్లి:** ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావన పెంపొందించుకోవాలని మాధవానంద సరస్వతిస్వామి, అద్వయా నరేంద్ర సరస్వతి స్వామి భక్తులకు సూచించారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు మూడు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రతిష్ఠాపన విగ్రహాలకు, యంత్ర పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సాత ఆత్మలింగం, సభ్యుడు జూలకంటి వెంకట్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.



మూలమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

## కీర్తి చాటాలి.. సంబురం అదరాలి

మొయినాబాద్ ఎంపీపీ నక్షత్రం

**మొయినాబాద్‌రూరల్/శంకర్‌పల్లి:** దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ కీర్తిని చాటుతూ.. సంబురాలు నిర్వహించాలని మొయినాబాద్ ఎంపీపీ నక్షత్రం, శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు ఎంపీడీఓ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలపై సర్పంచ్‌లు, అధికారులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కేవలం ముగ్గురు సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంఈఓ వెంకటయ్య, వైస్ ఎంపీపీ మమత, సర్పంచ్‌లు రాఘవరెడ్డి, మంజుల, ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, ఎంపీఓ గీత, ఏపీఎం బీమయ్య, మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు, శంకర్‌పల్లి ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేవతిరెడ్డి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్: అధికారులతో సమావేశమైన ఎంపీపీ నక్షత్రం

### వేడుకల వివరాలు

| తేదీ | ఉత్సవం | తేదీ | ఉత్సవం |
|---|---|---|---|
| జూన్ 2 | జెండా ఆవిష్కరణ, అమరులకు నివాళి | జూన్ 12 | తెలంగాణ రన్ |
| | | జూన్ 13 | మహిళా సంక్షేమం |
| జూన్ 3 | రైతు దినోత్సవం | జూన్ 14 | వైద్యారోగ్యం |
| జూన్ 4 | సురక్ష దినోత్సవం | జూన్ 15 | పల్లె ప్రగతి |
| జూన్ 5 | విద్యుత్ విజయోత్సవం | జూన్ 16 | పట్టణ ప్రగతి |
| జూన్ 6 | పారిశ్రామిక ప్రగతి ఉత్సవం | జూన్ 17 | గిరిజన దినోత్సవం |
| జూన్ 7 | తాగునీటి దినోత్సవం | జూన్ 18 | మంచినీళ్ల పండుగ |
| జూన్ 8 | చెరువుల పండుగ | జూన్ 19 | హరితోత్సవం |
| జూన్ 9 | సంక్షేమ సంబురాలు | జూన్ 20 | విద్యా దినోత్సవం |
| జూన్ 10 | సుపరిపాలన దినోత్సవం | జూన్ 21 | ఆధ్యాత్మిక దినోత్సవం |
| జూన్ 11 | సాహిత్య | జూన్ 22 | అమరులకు నివాళి |

## పేదల భూమి కబ్జాకు యత్నం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిమాయత్‌నగర్ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

బోర్డును తొలగించాలని గ్రామస్తుల వినతి

**మొయినాబాద్ రూరల్:** మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 151లో ప్రైవేటు వ్యక్తులు పాతిన బోర్డును తొలగించాలని గ్రామస్తులు తహసీల్దార్‌ను విన్నవించారు. సర్వే నెంబర్ 151లో గత ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చింది. వారు ఇళ్లు నిర్మించుకునేందుకు పంచాయతీ పాలకవర్గం సభ్యులు తీర్మాణించారు. ఇటీవల కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆ భూమిని కబ్జా చేసేందుకు బోర్డు పాతారు. దీంతో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో హిమాయత్‌నగర్ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు బోర్డులు తొలగించాలని తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వైఎస్ ఎంపీపీ మమత, సర్పంచ్ మంజుల యాదవ్, ఉప సర్పంచ్ శ్యామ్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు?

- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు
- గ్రామసభలు నిర్వహించి పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

**కొత్తూరు:** సిబ్బందికి ఇవ్వడానికి వేతనాలు లేవు.. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సమస్యలు పరిష్కరించడానికి నిధులు మంజూరు కావు.. ఎన్నుకున్న ప్రజలకు సమాధానం చెప్పలేక తాము పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండల సమావేశంలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కొత్తూరు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జి ఎంపీపీ శోభానాయక్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ నివేదిక సభకు వినిపించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**2011 జనాభా లెక్కలకు.. 2023 ప్రకారం చెల్లింపులు**

గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో పాలన భారంగా మారిందని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే వివరించారు. కొత్త పెన్షన్లు, రేషన్‌కార్డుల దరఖాస్తుదారులకు సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. సిబ్బందికి వేతనాలు ఇవ్వడానికి సైతం అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికీ పంచాయతీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం నిధులు మంజూరు చేస్తుండగా ఖర్చులు మాత్రం 2023 ప్రకారం చెల్లించాల్సి వస్తుందన్నారు. ధరణి సమస్యలపై రైతులకు సాయం చేయలేక పోతున్నామన్నారు. మండల సమావేశంలో సమస్యలు చెప్పినా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించడం దేనికని ప్రశ్నించారు.

**విడతల వారీగా పెన్షన్లు, రేషన్‌కార్డులు**

గ్రామాల్లో సభలు నిర్వహించి గ్రామాల వారీగా ధరణి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. త్వరలోనే పంచాయతీల ఖాతాలో నిధులు జమవుతాయని చెప్పారు. విడతల వారీగా పెన్షన్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, తహసీల్దార్ రాములు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిబిరాలతో క్రీడాకారులకు మేలు



వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న శశిధర్‌రెడ్డి, పాపారావు

పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి

**శంకర్‌పల్లి:** వేసవి క్రీడా శిబిరాలు క్రీడాకారులకు మేలు చేస్తాయని శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు అన్నారు. మోకిల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని వారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆశీర్వాదం, నాయకులు మోహన్‌రెడ్డి, ప్రణీత్‌కుమార్ చిన్న, శేఖర్, విఠల్ పాల్గొన్నారు.